
జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 85 7-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## భారత దేశంలోనే ఉన్నతమైన
# దేవాలయంగా తీర్చి దిద్దుతాం

- 225 కోట్లతో ఆలయ మాస్టర్ ప్లాన్ కి శ్రీకారం
- 200 కోట్లతో ముధోల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- హర్షం వ్యక్తం చేసిన నిర్మల్ జిల్లా ప్రజలు



**బాసర వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 06 రాష్ట్ర బ్యూరో డాక్టర్ ఏర్పుల శ్రీనివాస్):** నిర్మల్ జిల్లాలోని బాసరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం పర్యటించి,శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 225 కోట్ల రూపాయల వ్యయంతో అమలు చేయనున్న సమగ్ర అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టారు.ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా బాసరకు చేరుకోగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు (జిల్లా ఇన్చార్జి మంత్రి), దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్



## కాంగ్రెస్ నోట పాక్ పాట


- అందుకే జాతీయ భద్రత ప్రమాదంలో పడుతోంది
- ప్రధాని మోదీ విమర్శలు

2లో

## పవన్ కళ్యాణ్ ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం..
### మారనున్న ఆ రైల్వే స్టేషన్ రూపురేఖలు..



ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్' పరిధిలోకి పిఠాపురం స్టేషన్‌ను చేర్చుతూ రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ. 37.25 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది.



## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

- అరుదైన కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు
- శాంతి భద్రతలను కాపాడాల్సిన వారే చట్టాన్ని ఉల్లంఘించారు
- మృతుల కుటుంబాలకు రూ.1.40 కోట్లు పరిహారం చెల్లించాలని ఆదేశం
- కేసు విచారణలో ఉండగా కరోనాతో నిందితుడు ఎస్ఐ పాల్‌దొరై మృతి

2లో

## మరో 24 గంటల్లో హార్ముజ్‌ను
# తెరవాల్సిందే

- తాజాగా అమెరికాకు 10 షరతులు
- భారీ మూల్యం చెల్లిస్తారని హెచ్చరించిన ట్రంప్
- లేదంటే ఇరాన్‌ను బుగ్గి చేసేస్తామన్న అధ్యక్షుడు
- భారీగా జేఏఎస్ఎస్ఎం క్షిపణుల మోహరింపు!
- ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
- ఐఆర్‌జీసీ నిఘా సారథి, ఖుద్స్ ఫోర్స్ నేత హతం

ఇరాన్‌లో 30 మంది, ఇజ్రాయెల్‌లో నలుగురు మృతి

వాషింగ్టన్: నెలన్నర రోజులుగా ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న పశ్చిమాసియా యుద్ధం మరింత తీవ్రతరమయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయి. కాల్పులకు 45 రోజుల పాటు విరామం ఇచ్చేలా అమెరికా, ఇరాన్‌లను ఒప్పించేందుకు ఈజిప్టు, టర్కీ, పాకిస్తాన్ సోమవారం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాల్పులకు విరామంతో పాటు హార్ముజ్ జలసంధిని తెరవడం తదితరాలతో కూడిన ప్రతిపాదనను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్

- మిగతా 2వ పేజీలో



## రైతులు ముఖ్యమా ? వ్యాపారులు ముఖ్యమా తేల్చుకోవాలి

- రూ.3 వేల కోట్ల విలువైన భూములను కొల్లగొట్టే కుట్ర
- కోర్టు వివాదంలో ఉన్న 'దిల్'భూములను మార్కెట్‌కు ఎలా ఇస్తారు ?
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు



# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

- భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం
- నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి
- శ్రీ నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి
- శ్రీ గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం
- శ్రీ మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- శ్రీ 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు



మనందరికీ సర్వస్వండ దానిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టాం అన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. అనంతపురం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో నీటి సంరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. "నీరు మనందరికీ సర్వస్వం.. దానిని సంరక్షించుకోవడానికే 100 రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టాం" అని ఆయన తెలిపారు.

- మిగతా 2వ పేజీలో



## కేరళ సీఎం విజయన్‌దీ అదే తీరు
### రాహుల్‌గాంధీ విమర్శలు

త్రిసూర్/పాలక్కడ్: ప్రధాని మోదీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌లపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోమారు విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. త్రిసూర్ జిల్లాలోని మాలా, కున్నంకులమ్ పట్టణాలతోపాటు పాలక్కడ్ జిల్లా కేంద్రంలో సోమవారం రాహుల్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. "మోదీ, పినరయి విజయన్‌లకు దురహంకారం చాలా ఎక్కువ.

- మిగతా 2వ పేజీలో

## కేరళ సీఎం విజయన్‌దీ అదే తీరు

ప్రజలతో కలిసి పనిచేయడం మానేసి రాజు అనే ఆలోచనాధోరణితో వ్యవహరిస్తారు. తమను విమర్శించే పార్టీలు, వ్యక్తులను బీజేపీ లక్ష్యంగా చేసుకుంటుంది. కానీ కేరళలో సీఎం, ఆయన కుటుంబం వైపు బీజేపీ కన్నెత్తిచూడట్లేదు. కేసుల విచారణలు, ఈడీ, సీబీఐ దాడుల ఊసే ఎత్తట్లేదు. ఎల్‌డీఎఫ్, బీజేపీ రహస్య పొత్తు పెట్టుకున్నాయనడానికి ఇవే తార్కాణాలు. బీజేపీ దాడులకు కాంగ్రెస్ బెదిరిపోదు. పోరాటం కొనసాగిస్తాం"అని రాహుల్ పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి విజయన్ ఫొటోను ముద్రించి విజయన్‌కాకుండా ఇంకెవరు మరోసారి సీఎం అవుతారు? అనే ధోరణిలో 'ఇంకెవరు?'అంటూ ఎల్‌డీఎఫ్ కార్యకర్తలు ప్రచారంలోకి తీసుకొచ్చిన బిల్‌బోర్డులపై రాహుల్ విమర్శలు గుప్పించారు. "ఇంకెవరు? అంటే అర్థమేంటి? ఆయనేమైనా దేవుడా? ఆయన ఒక్కడే రాష్ట్రం మొత్తాన్నీ పరిపాలించలేడు. ఎంతో శక్తిసామర్థ్యాలున్న మహిళలు, ప్రతిభావంతులైన వ్యక్తుల సమన్వయంతో రాష్ట్రంలో పరిపాలన అనేది సాగుతుంది. ఇంకెవరు? అంటూ బ్యానర్లు కట్టడం అందర్నీ అవమానించడమే. ఇది దురహంకారానికి పరాకాష్ట. సీఎం ఒక్కరేకాదు అమిత్ షా, హిమంత బిశ్వ శర్మలకూ దురహంకారం పాళ్లు ఎక్కువ. ప్రధాని మోదీ అయితే తాను స్వయంగా దైవాంశగా చెప్పుకుని తిరుగుతున్నారు. ఆయన అలాగే ఊహాలోకంలో బతికేస్తున్నారు. కేరళలో సీఎం అయితే రాజునని భావిస్తున్నారు" అని రాహుల్ ధ్వజమెత్తారు.

## పవన్ కళ్యాణ్ ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం..

గతంలో పిఠాపురం పర్యటనకు వెళ్లిన సమయంలో పవన్ కళ్యాణ్ రైల్వే స్టేషన్ పరిసరాల్లోని అశుభ్రతను గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతరం జనవరిలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ తో ప్రత్యేకంగా సమావేశమై.. పిఠాపురం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరించారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్టేషన్‌ను ఆధునీకరించాలని కోరారు. ఈ నిధులతో పిఠాపురం రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించనున్నారు. స్టేషన్ భవనం , ముఖద్వారాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం.. దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతి గదుల నిర్మాణం.. అత్యాధునిక టాయిలెట్లు, డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్ మరియు ప్లాట్‌ఫారాల అభివృద్ధి.. ప్రయాణికుల కోసం అదనపు షెల్టర్ల నిర్మాణం అనేవి దీనిలో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. పిఠాపురం అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, నిరంతర మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో పిఠాపురం ఒక ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక రైల్వే హబ్‌గా మారనుంది.

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

తమిళనాడులో కలకలం సృష్టించిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వారిద్దరి మృతికి కారణమైన 9 మంది పోలీసులకు ఉరిశిక్ష విధించింది. మృతుల కుటుంబాలకు రూ.1.40 కోట్లను పరిహారంగా చెల్లించాలని తొమ్మిది మంది పోలీసులను కోర్టు ఆదేశించింది. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని ఉల్లంఘించి ఎటువంటి నేర చరిత్ర లేని తండ్రీ కుమారులను అత్యంత క్రూరంగా హింసించి చంపడం 'అరుదైన కేసు'గా న్యాయస్థానం అభివర్ణించింది. ఈ మేరకు మదురై అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి.ముత్తుకుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. దేశ న్యాయ చరిత్రలో లాకప్ డెత్ కేసులో ఇంత మంది పోలీసులకు ఓ కోర్టు మూకుమ్మడిగా మరణ శిక్ష విధించడం ఇదే తొలిసారి. మరణశిక్ష పడిన వారిలో ఎస్.శ్రీధర్ (అప్పటి ఇన్‌స్పెక్టర్). పి.రఘు గణేష్ (సబ్‌ఇన్‌స్పెక్టర్), కె.బాలకృష్ణన్ (సబ్‌ఇన్‌స్పెక్టర్), ఎస్.మురుగన్ (హెడ్ కానిస్టేబుల్), ఏ.సామిదురై (హెడ్ కానిస్టేబుల్), ఎం.ముత్తురాజ్ (కానిస్టేబుల్), ఎస్.చెల్లదురై (కానిస్టేబుల్), థామస్ ఫ్రాన్సిస్ (కానిస్టేబుల్), ఎస్.వెయిలుముత్తు (కానిస్టేబుల్) ఉన్నారు. మరో నిందితుడిగా ఉన్న స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దొరై కేసు విచారణలో ఉండగా కరోనాతో మరణించారు.(తండ్రీ కుమారులైన జయరాజ్, బెన్నిక్స్‌లు మొబైల్ దుకాణం నిర్వహించేవారు. కోవిడ్ సమయంలో వీరు లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ సేపు షాపు తెరిచారన్న ఆరోపణలతో (ఆ తరువాత దర్యాప్తులో ఇది అవాస్తమని తేలింది) 2020 జూన్ 19న తుత్తుకూడి జిల్లా సత్తాన్‌కులం పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లాకప్‌లో వారిని తీవ్రంగా కొట్టి హింసించడంతో పోలీసుల దెబ్బలకు తట్టుకోలేక జూన్ 2223 తేదీల్లో బెన్నిక్స్, జయరాజ్ మరణించారు. పోలీసులు దారుణంగా హింసించడం వల్లే వీరిద్దరూ మరణించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## రైతులు ముఖ్యమా ? వ్యాపారులు ముఖ్యమా తేల్చుకోవాలి

రంగారెడ్డి జిల్లా: 'అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ తర్వాత కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి.. సెటిల్‌మెంట్లకు దిగుతోంది. ఇప్పటికే నాదర్‌గుల్‌లోని రూ.7 వేల కోట్ల విలువైన భూములను కొల్లగొట్టేందుకు యత్నించిన ప్రభుత్వ పెద్దలు.. తాజాగా కోహెడలోని మరో రూ.3 వేల కోట్ల విలువ చేసే 200 ఎకరాల పండ్ల మార్కెట్ భూములను కూడా తమ అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు'అని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఎమ్మెల్యేలు పి.సబితారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్‌తో కలిసి సోమవారం ఆయన కోహెడలో పర్యటించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. 'కొత్తపేటలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్ల మార్కెట్‌ను కట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆ మేరకు 2020లో జీఓ నంబర్ 11 తీసుకొచ్చి మార్కెట్‌ను నోటిఫై చేశాం. భూములు కోల్పోయిన రైతులకు రూ.10 కోట్ల నష్టపరిహారం కూడా చెల్లించాం. జీఓ నంబర్ 216 ద్వారా మార్కెట్ ఖాతాలో రూ.350 కోట్లు జమ చేశాం. రూ.1,000 కోట్ల అంచనాలతో అత్యాధునిక మార్కెట్ యార్డ్‌కు డీపీఆర్ కూడా సిద్ధం చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటింది. ఇప్పటి వరకు తట్టెడు మట్టి తీయలేదు. టీజీఐఐసీ పేరుతో విలువైన ఈ భూములను తమ అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుంది.

# భారత దేశంలోనే ఉన్నతమైన దేవాలయంగా తీర్చి దిద్దుతాం





(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ఎస్పీ జానకి షర్మిల తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముఖ్యమంత్రి మనవడికి అక్షరాభ్యాసం చేయించారు.అనంతరం సమీపంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు.దేవాలయ సమీపంలో రూ.225 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించిన ముఖ్యమంత్రి, అదనంగా రూ.200 కోట్లతో ముధోల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన 'కాఫీ టేబుల్ బుక్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఇందులోని అంశాలను కలెక్టర్ వివరిస్తూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులకు నిర్మల్‌కు ప్రసిద్ధిగాంచిన కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్‌ను జ్ఞాపికలుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, బైంసా మున్సిపల్ చైర్మన్లు అప్పాల కావ్య, దత్తాత్రి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, ఆర్డీవో రత్నకళ్యాణి,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నోట పాక్ పాట



దిబ్రూగఢ్: ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ విమర్శల జడి కురిపించారు. "పాకిస్తాన్‌కు అనుగుణంగా కాంగ్రెస్ నడుచుకుంటోంది. తాజా ఘటనలే ఇందుకు సాక్ష్యం" అన్నారు. సోమవారం అస్సాంలోని బార్పేట, హోజాయ్, దిబ్రూగఢ్‌లలో మోదీ ఎన్నికల సభల్లో ప్రసంగించారు. "2016 సర్జికల్ దాడులు మొదలు సిందూర్ దాకా మనం చేపట్టిన ప్రతి ఆపరేషన్‌లోనూ కాంగ్రెస్ పాక్‌కే వంతపాడుతోంది. పాక్ ఎజెండాకే విలువిస్తోంది. దశాబ్దాల తరబడి మాజీ సైనికులకు వన్‌ర్యాంక్‌వన్ పెన్షన్ విధానం అమలు చేయకుండా కాంగ్రెస్ మాజీ సైనికులకు ద్రోహంచేసింది. మేం వచ్చాక రూ.1.24 లక్షల కోట్లను నేరుగా వాళ్ల బ్యాంక్ ఖాతాలో జమచేశాం. రాహుల్‌గాంధీ ప్రేమ దుకాణాలు తెరిచానని గొప్పగా చెప్పుకుంటారుకానీ వాస్తవానికి ఆయన అబద్ధాల దుకాణాలు, అవమానకర షాప్‌లు తెరిచారు. ప్రజల నుంచి బీజేపీ భూములు లాక్కుందని ఆరోపిస్తారుగానీ నేషనల్ హెరాల్డ్, రాజీవ్‌గాంధీ చారిటబుల్ ట్రస్ట్ తదితరాల గుప్పిట్లో ఎంత భూమి ఉందో చెప్పరు. కాంగ్రెస్ హయాంలో అస్సాంలో గుంతలు పడ్డ రోడ్లపై వాహనాలు కూడా సరిగా నడపలేని దుస్థితి. మేం ఏకంగా యుద్ధ విమానాలు అత్యవసరంగా ల్యాండ్ అయ్యేంత పటిష్టంగా రోడ్లు నిర్మించాం"అంటూ మోరాన్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ రహదారిని ఉద్దేశించి మోదీ చెప్పారు.

ఇటీవల కేరళలోని తిరువళ్లలో ప్రచార సభలో మోదీ ప్రసంగం మధ్యలో ఉన్నట్టుండి ఎస్పీజీ కమెండోలను పిలిచారు. "స్ఫటిక కమలం ఆకృతిలోని పేపర్‌వెయిట్‌ను ఈ సభలో చూశా. అలాంటిది ఒకటి కావాలి. కుదిరితే తెప్పించండి" అని సూచించారు. వెంటనే రంగంలోకి దిగిన నిర్వాహకులు సభలో క్రిస్టల్ కమలం ఎవరి వద్ద ఉందా అని ఆరా తీశారు. దాన్ని ఎక్కడ కొన్నారో కనుక్కున్నారు. తిరువళ్ల ప్రైవేట్ బస్టాండ్ సమీపంలోని ఆ దుకాణానికి వెళ్లి రెండింటిని కొని ప్రజాపనుల శాఖ గెస్ట్‌హౌస్ వద్ద ఎస్పీజీ అధికారులకు అందజేశారు. అదే రాత్రి వాటిని ఢిల్లీకి పంపించారు. మోదీ మెచ్చిన ఆ పేపర్ వెయిట్‌ను ప్రాచీన ఫెంగ్ షుయీ విధానంలో తయారు చేశారు. దాంట్లో 16 పూల రేకులు ఒక ఆధారానికి అతికించి ఉన్నాయి. దాన్ని తిప్పితే అందమైన పూల రేకులన్నీ తిరుగుతాయి.

## నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా నీటి భద్రత కోసం సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టడం, నిల్వ ఉన్న నీటిని సరైన విధంగా ఉపయోగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. జలాశయాలు నింపడం, ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మ సేద్యం వంటి పద్ధతులను విస్తృతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. "నీరు చెట్టు, నీరు మీరు, నీరు ప్రగతి" వంటి పథకాల ద్వారా నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చామని అన్నారు. అనంతపురం వంటి ఎడారిగా మారిన ప్రాంతాల్లో రైతులను ఆదుకునేందుకు గతంలో ఇన్‌పుట్ సబ్సిడీలు అందించామని గుర్తుచేశారు చంద్రబాబు.. డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తూ 90 శాతం సబ్సిడీతో పరికరాలు అందించామని చెప్పారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌కు రూ.1,031 కోట్ల వ్యయం చేస్తూ దేశంలో ముందంజలో ఉన్నామని వెల్లడించారు. ఈ చర్యల వల్ల రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారిందని, పండ్ల తోటల పెంపులో అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు. భూగర్భ జలాల స్థాయి కూడా మెరుగుపడిందని సీఎం పేర్కొన్నారు. గతంలో అనంతపురంలో 13 మీటర్ల లోతులో లభించిన నీరు ఇప్పుడు 11 మీటర్లకే అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఇది ప్రభుత్వ చర్యల ఫలితమని చెప్పారు. అలాగే శ్రీశైలం నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా రాయలసీమకు నీటిని తరలిస్తున్నామని వెల్లడించారు సీఎం చంద్రబాబు.. పట్టిసీమ ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా డెల్టాకు నీటిని అందించి, అక్కడ ఆదా అయిన నీటిని రాయలసీమకు మళ్లించామని చెప్పారు. విద్యుత్ ఛార్జీల విషయానికొస్తే, గత ప్రభుత్వాలు భారీగా పెంచిన భారం ప్రజలపై వేయకుండా కూటమి ప్రభుత్వం భరిస్తోందని సీఎం తెలిపారు. రూ.4,600 కోట్ల భారాన్ని కూడా ప్రజలపై మోపకుండా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వివరించారు. అంతేకాకుండా తొలిసారి విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ చేయడం కూటమి ప్రభుత్వ ఘనతగా ఆయన పేర్కొన్నారు. మొత్తంగా నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చి, రాష్ట్రాన్ని నీటి విషయంలో స్వయం సమృద్ధిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## మరో 24 గంటల్లో హార్ముజ్‌ను తెరవాల్సిందే

అరాఘ్చి, పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్‌కు ఆయా దేశాల ప్రతినిధులు అందజేశారు. కానీ ఈ ప్రతిపాదనను ఇరాన్ పూర్తిగా తిరస్కరించింది. "తాత్కాలిక కాల్పుల విరమణ కోసం హార్ముజ్‌ను తెరవడం ఇరాన్‌కు ఏ మాత్రమూ అంగీకారం కాదు. ఈ విషయాలన్నింటినీ పాక్ ద్వారా ఇప్పటికే అమెరికాకు తెలియజేశాం" అని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్‌ఎన్‌ఏ వెల్లడించింది. యుద్ధానికి శాశ్వతంగా తెర దించడం మినహా మరేదీ తమకు అంగీకారయోగ్యం కాదని కైరోలోని ఇరాన్ దౌత్య బృందం సారథి మొజ్తబా ఫిర్‌దౌసీ పోర్ కుండబద్దలు కొట్టారు! అంతేగాక యుద్ధానికి తెర దించే విషయమై ఇరాన్ తాజాగా అమెరికాకు 10 షరతులు కూడా విధించింది! ఈ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. ఇరాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదని స్పష్టం చేశారు. హార్ముజ్‌ను తెరవడంపై కూడా అంతకుముందే ఇరాన్‌కు ఆయన మరిన్ని హెచ్చరికలు చేశారు. "మీకు మంగళవారం రాత్రి 8 (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 5) గంటల వరకే గడువు. ఆలోపు దిగిరాకుంటే కనీవినీ ఎరగని దాడులతో సర్వనాశనం చేసేస్తాం" అంటూ హెచ్చరించారు. ఇరాన్‌పైకి అమెరికా ఇప్పటికే అత్యాధునిక లాంగ్ రేంజ్ జేఏఎస్‌ఎస్‌ఎంఈఆర్ క్షిపణులను భారీ సంఖ్యలో ఎక్కుపెట్టినట్టు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి! ఇజ్రాయెల్, అమెరికా సోమవారం ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ఇరాన్‌కు అత్యంత కీలకమైన సౌత్ పార్స్ చమురు క్షేత్రంపై కూడా ఇజ్రాయెల్ భారీగా దాడులకు దిగింది. దాంతో అక్కడి పెట్రో కెమికల్ ప్లాంటుకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు సమాచారం. టెహ్రాన్‌పై యుద్ధ విమానాలు గంటల తరబడి అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) నిఘా విభాగం అధిపతి మజీద్ ఖదేమీ మరణించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అంతేగాక ఐఆర్‌జీసీకి చెందిన ఖుద్స్ ఫోర్స్ కీలక నేత అస్ఘర్ బకేరీని కూడా అంతం చేసినట్టు పేర్కొంది. రాజకీయ, సైనిక ప్రముఖులందరినీ ఒక్కొక్కరుగా అంతం చేసి తీరతామని స్పష్టం చేసింది. మజీద్ మృతిని ఇరాన్ అధికారిక మీడియా కూడా ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో టెహ్రాన్‌లోని షరీఫ్ యూనివర్సిటీలో పలు భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆన్‌లైన్ క్లాసుల కారణంగా విద్యార్థులెవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఎస్లాంషార్ నగరంపై దాడుల్లో 15 మంది దాకా మరణించినట్టు అధికారులు వెల్లడించారు. కోమ్ నగరంలో పౌర ఆవాసాలపై దాడుల్లో ఐదుగురు, ఇతరచోట్ల మరో ఆరుగురి దాకా మృతి చెందారన్నారు. టెహ్రాన్‌లో ఓ ఇంటిపై జరిగిన దాడికి మరో ముగ్గురు బలయ్యారు. లెబనాన్‌లో కూడా దాడులను ఇజ్రాయెల్ తీవ్రతరం చేసింది. ఐన్ సాదే నగరంలో లెబనాన్ సైనికాధికారి ఒకరు దాడుల్లో మరణించారు. ఇరాన్ అంతటినీ ఒకే ఒక్క రాత్రిలో సర్వనాశనం చేసేయగల సత్తా అమెరికా సొంతమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. "అది బహుశా మంగళవారం రాత్రే కావచ్చు" అంటూ తాజాగా మీడియాతో మాట్లాడుతూ ఆయన హెచ్చరించారు. ఇరాన్ భూభాగం నుంచి ఎఫ్15ఇ యుద్ధ విమానం తాలూకు ఎయిర్‌మ్యాన్‌ను కాపాడేందుకు అమెరికా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ చరిత్రాత్మకమని అభివర్ణించారు.



## ప్రజా సంక్షేమమే ధ్యేయం..ప్రజల వద్దకే వైద్యం!

- 2వ వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి చొరవ
- వార్డు ప్రజలకు ఉచిత మందుల పంపిణీ
- అధిక సంఖ్యలో హాజరైన వృద్ధులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక 3వ వార్డులో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించి, రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డులోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందాలన్న ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య, ఏఎన్ఎం ఝాన్సీ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరోగ్య భారతే లక్ష్యం.. రాజపేటలో వైద్య శిబిరం

- ప్రజాపాలన ప్రగతి నివేదికలో భాగంగా నిర్వహణ
- రక్త పరీక్షల నిర్వహణ.. ఉచితంగా మందుల పంపిణీ
- భారీగా తరలివచ్చిన గ్రామస్తులు
- ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ కోయ మధు



**తొలివెలుగు, రాజపేట:** ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'ప్రజాపాలన ప్రగతి నివేదిక' కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజపేట గ్రామ కేంద్రంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోయ మధు, ఉపసర్పంచ్ కేదారి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో భాగంగా బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ వంటి వ్యాధులతో బాధపడే వారికి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. వైద్య నిపుణుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మోసెస్ రాజ్, హెచ్ఈఓ భీకు నాయక్, సూపర్వైజర్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, అనిత, పంచాయతీ కార్యదర్శి సాయిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొలుసుకట్టు చెరువులను సాగునీటితో నింపాలి

- కాలువలను పరిశీలించిన బిజెపి మండల శాఖ
- రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్



**తొలివెలుగు, రాజపేట:** కాళేశ్వరం ప్రాజెక్టు 15వ ప్యాకేజీ కాలువ ద్వారా మండలంలోని అన్ని గొలుసుకట్టు చెరువులను నింపి, రైతులకు సాగునీరు అందించాలని బిజెపి మండల శాఖ డిమాండ్ చేసింది. సోమవారం మండలంలోని కాలువలను బిజెపి శ్రేణులు క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు మేకల రమేష్ మాట్లాడుతూ.. సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, తక్షణమే అధికారులు స్పందించి చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ ప్యాకేజీ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే మండలంలోని గొలుసుకట్టు చెరువులన్నీ నిండి భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా రైతాంగానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మేకల రమేష్, మాజీ మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు, కిసాన్ మోర్చా నాయకులు మెండు భగవాన్ రెడ్డి, సాధనబోయిన శెంకర్, కుమ్మరి లక్ష్మణ్, చిగుళ్ల బీరయ్య, జన్నా సిద్దులు, దిడ్డి సత్యనారాయణ, నాగపురి ప్రవీణ్, బండి సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

# మురిసిన పసిమొగ్గలు.. సాగిన సందడి!

- గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో అట్టహాసంగా యూకేజీ గ్రాడ్యుయేషన్
- అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు
- సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు.. మురిసిపోయిన తల్లిదండ్రులు
- లక్ష్యసాధనలో క్రమశిక్షణే ముఖ్యం: చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి





**తొలివెలుగు, చౌటుప్పల్ :** ముద్దు ముద్దు మాటలు, చిరునవ్వులతో అలరించే పసిమొగ్గలు పట్టభద్రులైతే ఆ ఆనందానికి హద్దులుండవు. చౌటుప్పల్ పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ స్కూల్స్‌లో నిర్వహించిన యూకేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. చిన్నారుల కేరింతలు, ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బుడతలు వేసిన స్టెప్పులు, పాడిన పాటలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను మంత్రముగ్ధులను చేశాయి. పట్టాలు అందుకుంటున్న తమ పిల్లలను చూసి తల్లిదండ్రులు ఆనందంతో హర్షధ్వానాలు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరై యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారుల సర్వతోముఖ అభివృద్ధికి పాఠశాల, ఇల్లు రెండూ సమానంగా పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రాథమిక దశలోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని వారు తెలిపారు. పాఠశాల యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధను తల్లిదండ్రులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ వద్దు.. సర్కారు బడే ముద్దు!

- పీపల్ పహాడ్‌లో కదం తొక్కిన బడిబాట.. వాడవాడలా అవగాహన
- మా పిల్లలనూ సర్కారు బడికే పంపుతాం: సర్పంచ్ నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్
- విద్యా రంగానికి ఆదర్శంగా నిలవాలి: ఎంఈఓ గురువరావు



**తొలివెలుగు, చౌటుప్పల్ :** పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'బడిబాట' కార్యక్రమం చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామంలో సోమవారం ఉత్సాహంగా సాగింది. వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు పాఠశాలలకు పంపే కంటే, అన్ని హంగులు ఉన్న ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) గురువరావు, సర్పంచ్ పులనగారి నాగేశ్వరి-అశ్విన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామంలోని వాడవాడలా తిరిగి ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, నర్సరీ నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బోధన సాగుతోందని వివరించారు. గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచేందుకు భవిష్యత్తులో తమ పిల్లలను సైతం ప్రభుత్వ పాఠశాలకే పంపుతామని సర్పంచ్ దంపతులు స్పష్టం చేశారు. ఎంఈఓ గురువరావు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిలో చౌటుప్పల్ మండలానికే పీపల్ పహాడ్ ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ రెడ్డి, ఉప సర్పంచ్ బకనగారి శ్రవణ్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు బద్దం సుదాకర్ రెడ్డి, పిల్లి సాయి, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## యాదద్రి నాథుని సేవలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


- కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు
- వేద పండితుల ఆశీర్వచనం.. తీర్థప్రసాదాల అందజేత



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. దర్శనానంతరం క్షేత్రంలోని ముఖ మండపంలో వేద పండితులు, అర్చకులు ఆయనకు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనం గావించారు. ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నల్లన్థీఘళ్ సురేంద్ర ఆచార్యులు, శ్రీధరాచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, వజ్జల లక్ష్మణాచార్యులు, ఆలయ అధికారులు సీతారామాచార్యులు, చంద్రమౌళి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మురికి కూపంగా సాగు భూమి!

- కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన బాలరాజు
- గ్రామ పంచాయతీ కాలువతో భూసారం దెబ్బతింటోందని వినతి



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/రాజపేట:** రాజపేట మండల కేంద్రంలోని మురుగునీరు తన వ్యవసాయ పొలంలోకి చేరుతూ పంటలను దెబ్బతీస్తోందని రైతు సందేల బాలరాజు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి తన గోడును వెళ్లబోసుకున్నారు. రాజపేటలోని సర్వే నంబరు 139, 142 పరిధిలో తనకు గల ఒక ఎకరా 20 గుంటల సాగు భూమిలోకి గ్రామ పంచాయతీకి సంబంధించిన మురుగు కాలువ నీరు వచ్చి చేరుతోందని వివరించారు. మురికి నీటి వల్ల భూసారం క్రమంగా తగ్గిపోయి, పంటలు పండక తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఈ విషయమై కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి మురుగునీరు పొలంలోకి రాకుండా తగు చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.



## భక్తిశ్రద్ధలతో ఏకాదశ రుద్రాభిషేకం

- మార్మోగిన నమక, చమకాలు.. భక్తి పారవశ్యంలో భక్తులు
- శోభాయమానంగా స్వామివారి అలంకరణ



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న శివాలయంలో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం సందర్భంగా ఆలయంలో స్వామివారికి అర్చకులు ఏకాదశ రుద్రాభిషేకాన్ని అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో వేద మంత్రోచ్చారణలు మిన్నంటాయి. రుద్రం, నమకం, చమకం పఠిస్తూ మహాన్యాస పూర్వకంగా స్వామివారికి పంచామృతాలతో విశేష అభిషేకం జరిపారు. స్వామివారి గర్భాలయం శివనామ స్మరణతో మార్మోగింది. అభిషేక పూజల అనంతరం పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో స్నపనం నిర్వహించారు. తదనంతరం పరమశివుడికి వివిధ రకాల సుగంధ పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ పురోహితులు సత్యనారాయణ శర్మ, నాగరాజు శర్మ, నరసింహమూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

- పార్టీ జెండాను ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు మేకల రమేష్
- కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపు

**తొలివెలుగు, రాజపేట:** భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజపేట మండల కేంద్రంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మేకల రమేష్ నివాస ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేకల రమేష్ మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 46 వసంతాలు పూర్తయిన శుభసందర్భంలో, గతంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ నాయకుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సమయాన్ని వెచ్చించి, అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ కోయ మధు హాజరయ్యారు. అలాగే తాజా మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు, పట్టణ అధ్యక్షులు సాధనబోయిన శంకర్, గాండ్ల నర్సింగరావు, చిగుళ్ల బీరయ్య, దాచేపల్లి శ్రీనివాస్, సోమసాని చంద్ర మోహన్, జన్నా సిద్దులు, మెండు భగవాన్ రెడ్డి, బూర్గు శేఖర్ రెడ్డి, పంది రాజు, నాగపూరి పుల్లయ్య, సంగెం వేణు, సకినాల చిరంజీవులు, దేశపాండే ప్రసాద్, ఐరేణి శ్రీధర్, బండి సిద్దులు, పిసిక వెంకటేష్, గిడ్డి సత్యనారాయణ, బల్ల కృష్ణ, కాకల సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల శిక్షణతోనే గ్రామ వికాసం

- విధులు, బాధ్యతలపై పట్టు సాధించాలి: ఎంపీడీవో నాగవేణి
- రాజపేటలో ప్రారంభమైన రెండో విడత శిక్షణ తరగతులు





**తొలివెలుగు, రాజపేట:** గ్రామాల్లో సుపరిపాలన అందించడంలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, వారు తమ విధులను పూర్తిస్థాయిలో తెలుసుకున్నప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నాగవేణి అన్నారు. సోమవారం రాజపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండో బ్యాచ్ వార్డు సభ్యులకు 'గ్రామ పాలన'పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు పంచాయతీ రాజ్ చట్టం, నిధుల వినియోగం, వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణకు సభ్యులందరూ ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు. ఎంపీవో ఆవుల కిషన్ మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఓటీలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కొత్త కాలనీలో వైభవంగా బోనాల ఉత్సవం

- నల్ల పోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం
- మురిసిన రాజపేట.. పాల్గొన్న ప్రముఖ గాయని శోభారాణి




**తొలివెలుగు, రాజపేట:** మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల పక్కన గల కొత్త కాలనీలో నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా కాలనీవాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి జాతర నిర్వహించారు. కాలనీ మహిళలు మంగళవాయిద్యాల నడుమ బోనమెత్తి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ప్రముఖ జానపద గాయని పబ్బోజు శోభారాణి తన సోదరీమణులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ.. తన సొంత గ్రామంలో అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని, ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కాలనీవాసులంతా ఐక్యమత్యంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. గత ఏడాది పబ్బోజు రాధమ్మ, ఉట్కూరి మాధవిల విశేష కృషితో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగిందని, అప్పటి నుంచి ఏటా వేడుకలు ఘనంగా సాగుతున్నాయని కాలనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## పండుగలా విగ్రహావిష్కరణ.. దాతలకు అపూర్వ సత్కారం





- సమాన అవకాశాల రూపశిల్పి బాబూ జగ్జీవన్ రామ్
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
- ఘనంగా 119వ జయంతి వేడుకలు.. నివాళు లర్పించిన అధికారులు

**తొలివెలుగు, భువనగిరి:** సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకెళ్లాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ చౌరస్తా (ప్రిన్స్ కార్నర్, రైతు బజార్ ఎదురుగా) వద్ద షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డిలు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల మహనీయుల మాసమని, ఏటా బాబూ జగ్జీవన్ రామ్, జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతులను స్ఫూర్తిదాయకంగా జరుపుకుంటామన్నారు. దళితులకు సమాన అవకాశాలు కల్పించిన ఘనత జగ్జీవన్ రామ్‌కే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, పరిపాలనా దక్షుడిగా మూడు దశాబ్దాల పాటు ఉప ప్రధాని, కేంద్ర మంత్రి హోదాల్లో ఆయన అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకా రెడ్డిలు మాట్లాడుతూ.. 1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా ఆయన చూపిన తెగువ, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశంలో ఆకలి చావులు లేకుండా హరిత విప్లవాన్ని ప్రోత్సహించిన తీరును కొనియాడారు. రాజ్యాంగ సవరణల ద్వారా అణగారిన వర్గాలకు ఆయన ఎంతో మేలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణా రెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సాహితీ, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## అనుమతులు లేని క్రషర్‌ను రద్దు చేయాలి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ముట్టడి
- పొల్యూషన్ బోర్డు నిబంధనలు గాలికొదిలేశారని ధ్వజం
- అఖిలపక్ష నాయకుల మద్దతు



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన 'సిరి మెటల్ ప్రొడక్ట్స్' కంకర క్రషర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాధితులు, అఖిలపక్ష నాయకులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి నేతృత్వంలో నిర్వహించిన ఈ ధర్నాలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కనీస అనుమతులు లేకుండా, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే ఈ క్రషర్‌ను ఏర్పాటు చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి వల్ల సుమారు 300 ఎకరాల్లోని పంట పొలాలు దెబ్బతింటున్నాయని, 50కి పైగా రైతు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్నదాతలకు తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, సీపీఎం నాయకులు బడుగు రమేష్, బీఆర్ఎస్ నాయకులు పున్న వెంకటేశం, పీఆర్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్ గోపాల్, విలేజ్ డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు కిషోర్, రైతు నాయకులు కందుల మల్లారెడ్డి, పీఆర్‌పీఎస్ జిల్లా నాయకులు గాదె ఎల్లేష్, గ్రామ ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్, బీజేపీ గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ, సీపీఎం నాయకులు బల్గూరి అంజయ్య, రైతులు దయ్యాల మల్లయ్య, దయ్యాల శ్రీశైలం, బల్గూరి నరసింహ, సంగిశెట్టి మహేష్, బల్గూరి వెంకటేశం, కోనూరు యాదగిరి గౌడ్, బీసుల బీరయ్య, బండారు నరసింహ, కందుల యాదగిరి రెడ్డి, కందుల బాసిరెడ్డి, కట్ట శ్రీధర్ రెడ్డి, బిట్ల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి


- చల్లూరులో గణపురం యువజన సంఘం సమావేశం
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: వార్డు సభ్యుడు శ్రీకాంత్



**తొలివెలుగు, రాజపేట:** గ్రామాల ప్రగతిలో యువజన సంఘాల పాత్ర కీలకమని, సామాజిక బాధ్యతతో సమస్యల పరిష్కారానికి యువత ముందుకు రావాలని చల్లూరు 3వ వార్డు సభ్యుడు, గణపురం యువజన సంఘం అధ్యక్షుడు గణపురం శ్రీకాంత్ అన్నారు. సోమవారం చల్లూరు గ్రామంలో గణపురం యువజన సంఘం సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. గ్రామంలోని మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, ఇతర ప్రజా సమస్యలపై యువజన సంఘం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ, సభ్యులందరూ ఐక్యంగా గ్రామ వికాసం కోసం పాటుపడాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. యువతలో సేవా దృక్పథాన్ని పెంపొందించేలా మున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గణపురం నరేందర్, సిద్దేశ్వర్, మధు, చక్రపాణి, చంద్రమౌళి, భావానందం, శ్రీను, ప్రశాంత్, అనిల్, నితిన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్

- అభివృద్ధి పనులపై చర్చ
- శాలువాతో సత్కారం, స్వామివారి ప్రసాదం అందజేత





**తొలివెలుగు, భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ సోమవారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి ప్రసాదాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలేరు మున్సిపాలిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ ప్రగతిలో భాగంగా చేపడుతున్న పనులకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకారెడ్డిని కూడా కలిసి సన్మానించారు. పట్టణ అభివృద్ధికి నిధుల మంజూరు, పెండింగ్ పనుల పూర్తిపై అధికారులతో చర్చించారు.

## కార్మిక హక్కుల సాధనకు సమరశంఖం పూరించాలి

- బీటీ రణదీవే స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలి
- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ ధ్వజం
- ఘనంగా భారత కార్మిక ఉద్యమ నేత బీటీ రణదీవే 36వ వర్ధంతి

**తొలివెలుగు, రామన్నపేట:** భారత కార్మిక ఉద్యమ పితామహుడు, సీఐటీయూ తొలి అఖిల భారత అధ్యక్షుడు బీటీ రణదీవే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోరిగె సోములు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఆయన స్ఫూర్తితో సంఘటిత పోరాటాలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సీఐటీయూ మండల కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో బీటీ రణదీవే 36వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రణదీవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోరిగె సోములు సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో నూతన లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల జీవితాలతో మోదీ సర్కారు చెలగాటమాడుతోందని విమర్శించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న ఈ లేబర్ కోడ్‌లతో శ్రామికులపై పెను భారం పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు ఎన్నో ఏళ్లుగా రక్తం చిందించి పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, కనీస వేతనాలు కూడా నోచుకోకుండా, కనీసం సంఘాలు కూడా పెట్టుకోకుండా హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్రం కేవలం కార్పొరేట్ శక్తులకు మాత్రమే ఎర్రతివాచీ పరుస్తోందని ఎద్దేవా చేశారు. తమ హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా కార్మిక లోకమంతా రోడ్లకెక్కి సమ్మెలు చేస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం గర్హనీయమన్నారు. జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో కేంద్రం మెడలు వంచేలా మరో బలీయమైన ఉద్యమానికి కార్మికులంతా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీటీ రణదీవే ఆదర్శాలతో క్షేత్రస్థాయిలో కార్మికులను ఏకం చేసి సీఐటీయూ అలుపెరగని పోరాటం చేస్తుందని, ఈ మహోద్యమంలో ప్రతి ఒక్కరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, భావన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వంగాల మారయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, స్వామి పాల్గొన్నారు.





## రామన్నపేట నియోజకవర్గ సాధనే లక్ష్యం

- ప్రజాప్రతినిధులు, ప్రజల ఐక్యతతోనే సాధ్యం
- ఇంద్రపాల నగరం, నిధాన్ పల్లి సర్పంచుల సన్మాన సభలో ఎర్ర రమేష్ గౌడ్
- సాధన సమితి పిలుపునకు ప్రజాప్రతినిధుల మద్దతు




**తొలివెలుగు, రామన్నపేట:** గతంలో ఉన్న రామన్నపేట నియోజకవర్గాన్ని తిరిగి సాధించుకోవడమే ఏకైక అజెండాగా ఉద్యమించాలని నియోజకవర్గ సాధన సమితి నాయకుడు ఎర్ర రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా ప్రజాప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిధులను ఏకం చేసే కార్యక్రమంలో భాగంగా.. ఇంద్రపాల నగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్, ఉప సర్పంచ్ పోలిపాక జయసుధ, నిధాన్ పల్లి సర్పంచ్ నారపాక మాధవి యాదయ్య, ఉప సర్పంచ్ కొండా అండాలుతో పాటు ఇరు గ్రామాల వార్డు సభ్యులను సాధన సమితి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రామన్నపేట నియోజకవర్గ ఆకాంక్షను ప్రభుత్వాలకు చాటిచెప్పేందుకు మనకు వచ్చిన ఈ అవకాశాన్ని అందరం కలిసి వినియోగించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో చేపట్టే వివిధ పోరాట కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. దీనిపై ఇరు గ్రామాల సర్పంచులు స్పందిస్తూ.. పోయిన మన నియోజకవర్గాన్ని తిరిగి తెచ్చుకోవడానికి సాధన సమితి చేసే ప్రతి పోరాటంలో తాము ముందుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నల్ల నరేందర్, సాధన సమితి కార్యదర్శి గడ్డం యాదగిరి, డాక్టర్ నకిరేకంటి అశోక్, ఉపాధ్యక్షులు ఎండి ఫజల్, ప్రచార కార్యదర్శి జెట్టి శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు నకిరేకంటి నరేష్, పెండెం రవీందర్, ఆవుల నరేందర్, ఎమ్.డి ఇమామ్, మీర్ ఖాజా అలీ పాల్గొన్నారు.

## రామన్నపేటను అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం చేయాలి

- అన్ని అర్హతలున్నా నిర్లక్ష్యం తగదు
- గత వైభవాన్ని పునరుద్ధరించాలి: రాపోలు నరసింహ
- నియోజకవర్గాల పునర్విభజనలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్



**తొలివెలుగు, రామన్నపేట:** రాబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు, పునర్విభజన ప్రక్రియలో భాగంగా రామన్నపేటను తిరిగి నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహ డిమాండ్ చేశారు. గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉండి, ప్రస్తుతం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు నిలయంగా ఉన్న రామన్నపేటకు ఆ అర్హత ఉందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం రామన్నపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రామన్నపేటలో ఇప్పటికే కోర్టు, ప్రభుత్వాసుపత్రి, రెవెన్యూ డివిజన్ కార్యాలయంతో పాటు అన్ని కీలక ప్రభుత్వ విభాగాలు ఉన్నాయని నరసింహ గుర్తుచేశారు. గతంలో నియోజకవర్గంగా ఉన్న చరిత్రను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత పునర్విభజనలో ప్రజల ఆకాంక్షను గౌరవించాలని కోరారు. రామన్నపేటను నియోజకవర్గంగా సాధించుకునే వరకు కులమతాలకు, పార్టీలకు అతీతంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామన్నపేట మండల పార్టీ అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్, చేనేత నాయకులు గోసిక చక్రపాణి, తెలుగుదేశం పార్టీ బీసెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, గజం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి: సర్పంచ్ ఆర్థిక సాయం

- మృతుడు సల్ల చిన్న రామచంద్రం కుటుంబానికి పరామర్శ
- రూ. 5 వేల నగదు అందజేత

తొలివెలుగు, రామన్నపేట: రామన్నపేట పట్టణానికి చెందిన సల్ల చిన్న రామచంద్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ సోమవారం మృతుడి నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రామచంద్రం మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, తక్షణ సహాయం కింద రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, ఉప సర్పంచ్ మోటి రమేష్, సీనియర్ నాయకులు జినుకుల ప్రభాకర్, ఎండి నాసర్, బొడ్డు సురేందర్రావు, జేల్లా వెంకటేశం, కోట సుధాకర్, బుర్రి రవీందర్, ఊరే శేఖర్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు కొమ్ము రామస్వామి, గొరిగే శేఖర్, ఎండి రిజ్వాన్, ఘట్కే నవీన్ తదితరులు పాల్గొని మృతుడికి అంజలి ఘటించారు.



# స్మశాన వాటికలు..

# సమస్యల నిలయాలు!

- నిర్లక్ష్యానికి నిలువుటద్దం గోపరాజుపల్లి వైకుంఠధామం
- ఆరుబయటే మహిళల స్నానాలు.. పట్టించుకోని అధికారులు
- త్వరలోనే పరిష్కరిస్తాం: ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**తొలివెలుగు, వలిగొండ:**

"చనిపోయాకైనా ప్రశాంతంగా వెళ్లనివ్వండి" అంటూ వలిగొండ మండల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన స్మశాన వాటికలు సౌకర్యాల లేమితో సమస్యల నిలయాలుగా మారాయి. ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన స్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ముఖ్యంగా స్నానపు గదులు నిర్మించినప్పటికీ నీటి సౌకర్యం లేక అవి కేవలం ప్రదర్శనకే పరిమితమయ్యాయి. దీంతో అంత్యక్రియలకు హాజరయ్యే మహిళలు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని సీపీఎం నాయకుడు గాజుల ఆంజనేయులు విమర్శించారు. నాసిరకం నిర్మాణాలతో పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారని, తాగునీరు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చిందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ పథకాల ప్రధాన ఉద్దేశ్యమైతే, అమలు దశలో నిర్లక్ష్యం, ప్రణాళికల లోపంతో ఈ సదుపాయాలు నిరుపయోగంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ లోపంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్మశాన వాటికలను ఉపయోగించుకునేలా తగిన సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.









ఈ సమస్యను మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే లోపాలను సరిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారులు మాటలు మాత్రమే చెబుతున్నారే తప్ప చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## రామన్నపేటలో రెపరెపలాడిన కాషాయ జెండా

- ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా భాజపా
- రామన్నపేట, సూరారంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- జెండా ఆవిష్కరించిన నియోజకవర్గ ఇన్చార్జి మొగులయ్య
- పార్టీలోకి భారీగా యువత చేరిక

**తొలివెలుగు, రామన్నపేట:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రామన్నపేట మండల కేంద్రంతో పాటు సూరారం గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నకిరేకల్ నియోజకవర్గ ఇన్చార్జి నకరకంటి మొగులయ్య ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడుతూ.. 1980 ఏప్రిల్ 6న అటల్ బీహార్ వాజ్ పేయి నేతృత్వంలో ఆవిర్భవించిన భాజపా, నేడు నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని కొనియాడారు. లాల్ కృష్ణ అద్వానీ రథయాత్రల ద్వారా పార్టీ విస్తరణకు పునాదులు వేశారని గుర్తు చేశారు. మోదీ పరిపాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమై, భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా నిలుస్తోందన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సూరారంలో పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున యువత భాజపాలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, జిల్లా నాయకులు దోగుపర్తి సుభాష్, మద్దూరి ప్రభాకర్ రావు, కట్ట యాదయ్య, గోపగోని ధర్మరాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పల్లపు దుర్గయ్య, యువమోర్చా జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, మండల ప్రధాన కార్యదర్శి బెజ్జంకి శివకుమార్ చారి, ఉపాధ్యక్షులు కంభంపట్టి శివరంజన్, బట్టే రమేష్, కోశాధికారి గురుకు జ్యోతి, కార్యదర్శులు రేపాక లింగస్వామి, బందెల సంజీవ, బతుక నరేష్, కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన నరేష్, కేసీడీ నవీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు, శక్తికేంద్ర ఇంచార్జులు, యువకులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.






## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- అకాల వర్షాలతో రైతులకు నష్టభయం
- ధర్మారెడ్డిపల్లి కాలువ పనులు పూర్తి చేయాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం మండల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రైతు సంఘం మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రబీ కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు మొదలుకాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయని, అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి రైతులు నిలువునా మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుని, గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ధర్మారెడ్డిపల్లి కాలువ పనులను జూన్ నాటికి పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బోయిని ఆనంద్, కార్యదర్శిగా గన్నెబోయిన విజయభాస్కర్, ఉపాధ్యక్షులుగా కందుల మల్లారెడ్డి, తాళ్లపల్లి జితేందర్, కమిటీ సభ్యులుగా కొమ్ము అంజమ్మ, కరకంటి మల్లయ్య, బొల్ల వెంకన్న, దేవరపల్లి బిక్షం రెడ్డి, దాడి మల్లారెడ్డి, సిల్వర్ రాజు, తాడూరి కిష్టయ్య, కాకులారపు కల్పన, గంగాదేవి అంజయ్య, బండ జగన్మోహన్ రెడ్డి తదితరులను ఎంపిక చేశారు.




# 'ఈగో రాజా' ఉగాది స్పెషల్ లుక్

శంబాల సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ యంగ్ యాక్టర్ ఆది సాయికుమార్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఆదిసాయికుమార్ గురు శరవణన్ డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈగో రాజా (జుస్త్రశీ =ఖుయిఖు)టైటిల్‌తో వస్తోన్న ఈ మూవీని ఎస్‌జీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జీ సురేశ్ నిర్మిస్తున్నారు. ఆది సాయికుమార్ తమిళ్ డెబ్యూ సినిమాగా వస్తోన్న ఈగో రాజా తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సతీశ్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ కొత్త లుక్ విడుదల చేశారు. ఆదిసాయికుమార్ చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు చూస్తుంటే హై ఓల్టేజీ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఆది నిప్పు రాజేసేలా యాక్షన్ అవతార్‌లో ఇప్పటివరకు లేని విధంగా సిగరెట్ కాలుస్తూ అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ఆదిలో ఇదివరకెన్నడూ చూడని డైమెన్షన్‌ను చూడబోతున్నారని తాజా లుక్‌తో హింట్ ఇచ్చేస్తున్నారు మేకర్స్. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ కేఎస్ రవికుమార్ దగ్గర పనిచేసిన గురు శరవణన్ డైరెక్షన్‌లో వస్తున్న సినిమా కావడం, బైలింగ్యువల్ ప్రాజెక్టు అవడంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. ఈ చిత్రాన్ని గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు. హై ఆక్టేన్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి రాబోయే రోజుల్లో మరిన్ని అప్‌డేట్ అందిస్తామని మేకర్స్ చెబుతున్నారు.

# దుష్టశిక్షణలో బ్యాడ్ బాయ్ కార్తీక

నాగశౌర్య హీరోగా రామ్ దేశినా (రమేష్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాత. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో నాగశౌర్య పవర్‌ఫుల్ మాస్ పాత్రలో కనిపించారు. అమాయకుల్ని కాపాడే ప్రయత్నంలో కార్తీక్ దుష్టశక్తులతో పోరాడే క్రమాన్ని ఇంటెన్స్ ఎమోషన్స్‌తో ఆవిష్కరించారు. ట్రైలర్ చివర్లో నాగశౌర్య లక్ష్మీనరసింహ స్వామి ప్రజెన్స్‌లో కనిపించడం హైలైట్‌గా నిలిచింది. యాక్షన్, ఎమోషన్స్, కామెడీ అంశాలతో ఈ సినిమా అందరికి నచ్చుతుందని నాగశౌర్య తెలిపారు. ఈ సినిమాలో నాగశౌర్య పాత్రలోని వేరియేషన్స్ అందరినీ సర్‌ప్రైజ్‌కు గురిచేస్తాయని, సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాత చింతలపూడి శ్రీనివాసరావు చెప్పారు. విధి, సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జైరాజ్, నిర్మాణ సంస్థ: శ్రీవైష్ణవి ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్).



# అదేం తప్పు కాదు

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా దక్షిణాదిలో ఓ వెలుగు వెలిగి ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీ అయ్యిన నటి ప్రియమణి. డస్కీ బ్యూటీగా కుర్రాళ్లకు సెగలు రేపిన ప్రియమణి.. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో వరుసగా అవకాశాలు అందుకుంటుంది. ఇటీవల 'ఎస్ సరస్వతి' మూవీతో ప్రేక్షకులను పలకరించింది ఈభామ.. కాగా ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్‌కామెంట్స్‌చేసింది ప్రియమణి. 'బికినీ ధరించడం తప్పు కాదు. స్టోరీకి తగినట్లుగా, ఆ పరిస్థితులకు అనుగుణమైన దుస్తులు వేసుకోవాల్సిందే. స్విమ్మింగ్ పూల్ సీన్ ఉంటే అప్పుడు చీర, జీన్స్ వంటివి ధరించలేం కదా. ద్రోణి సినిమాలో బికినీ సీన్ చేయడానికి కాస్త భయపడ్డాను. అయితే ఆ చిత్ర దర్శకుడు నన్ను కన్విన్స్ చేసే ప్రయత్నం చేశాడు. అప్పట్లో 'టషన్' సినిమాలో కరీనా కపూర్ బికినీ ధరించిన సీన్ వైరల్ కావడంతో తనను కూడా అలాగే డిఫరెంట్‌గా చూపిస్తానని చెప్పాడు. అప్పటి వరకు నేను ఏ సినిమాలోనూ బికినీ, స్విమ్ సూట్ లాంటివి వేసుకోలేదు. దాంతో ఒకసారి ట్రై చేద్దామని ఓకే చెప్పా. ఈ సీన్ తర్వాత నాపై చాలా కామెంట్స్ వచ్చాయి. విపరీతంగా ట్రోలింగ్స్ చేశారు.. అప్పటి వరకు సాధారణ పాత్రలు చేసిన నన్ను.. ప్రేక్షకులు కొత్తగా చూడటంతోనే ఇలా జరిగింది. నటిగా ఉన్నప్పుడు పరిస్థితి డిమాండ్ చేస్తే అలాంటి డ్రెస్ వేసుకోక తప్పదు. అలాగని మన కంఫర్ట్‌ని పక్కన పెట్టకూడదు. ఇప్పుడు బికినీ వేసుకోమంటే మాత్రం చేయను' అంటూ తేల్చి చెప్పేసింది. ఇక ప్రస్తుతం ప్రియమణి నటించిన జన నాయగన్ రిలీజ్‌కు రెడీగా ఉంది. ఇది కాకుండా జీడీఎన్, గోల్‌మాల్ సినిమాల్లో ప్రియమణి నటిస్తోంది.



# అది బ్రేకింగ్ న్యూస్ కాదు!

అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ఓ వ్యాపారవేత్తతో పెళ్లిపీటలెక్కబోతున్నదని గత కొన్ని రోజులుగా సోషల్‌మీడియాలో వార్తలొస్తున్నాయి. తాజాగా వీటిని ఆమె వ్యక్తిగత టీమ్ ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఒకరి వ్యక్తిగత జీవితం గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించింది. 'అనుష్క శెట్టి వయసుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వార్తల్ని ప్రచారం చేస్తున్నారు. మరి హీరోల వయసు విషయంలో మీలో ఆ ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు?' అని ప్రశ్నించింది. 'తన వ్యక్తిగత జీవితం విషయంలో అనుష్క గోప్యతను పాటిస్తుంది. పెళ్లి అనేది వ్యక్తిగత విషయం. అది బ్రేకింగ్ న్యూస్ ఎంత మాత్రం కాదు. వార్తల్ని ప్రచురించే ముందు నిజానిజాలేమిటో తెలుసుకోం డి' అంటూ అనుష్క టీమ్ పేర్కొన్నది.

